

2 లో..

బాల్య వివాహాలు,బాలికల అక్రమ రవాణా పై అవగాహన


జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

గురువారం 5 మార్చి 2026 పేజీలు : 14




# 6న ఉమ్మడి నల్గొండ జిల్లా

# సన్నాహక సమావేశం

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక నిర్వహణపై ఈనెల 6 న నల్గొండలో ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశం

హాజరుకానున్న ఉమ్మడి జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుండి 12 వరకు 99 రోజులపాటు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు

అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం

నల్గొండ మార్చి 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):

మంగళవారం రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులోని ఆదేశాల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు “ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక” కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని, నిర్దేశించిన తేదీల ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికపై ఈ నెల 6 న ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశాన్ని నల్గొండలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా వివిధ శాఖల ద్వారా నిర్వహించే కార్యక్రమాలు,...మిగతా 3లో

2 లో..

## ఆమనగల్లు జాతరలో అపశృతి



2 లో..



## కోదాడ మండలంలో మద్యం మాఫియా ‘బరితెగింపు’

కోదాడ మండలంలో మద్యం దందా అన్ని హద్దులను దాటేసింది. చట్టబద్ధంగా లైసెన్స్ పొందిన దుకాణాలు ఇప్పుడు అక్రమ నెట్‌వర్క్‌లకు అడ్డాగా మారాయి. పట్టణ కేంద్రంలోని వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు లాభార్జనే ధ్యేయంగా పల్లెల్లో 'లిక్కర్ వార్'కు తెరలేపాయి.

## ఘనంగా హోలీ పండుగ వేడుకలు



నూతనకల్.. మార్చ్ 04 (ప్రజా జ్యోతి):

మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో హోలీ పండుగ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు.యువతి యువకులు,మహిళలు, చిన్నారులు,చిన్న పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ జరుపుకున్న హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందోత్సవాల నడుమ గడిపారు. ఈ కార్య క్రమంలో బక్కహేమ్లతండా సర్పంచ్ గుగులోత్ కృష్ణా నాయక్ పాల్గొన్నారు

# గ్రామ సమగ్రాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



4 లో..

సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 04(ప్రజాజ్యోతి)

:గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు.

# బాల్య వివాహాలు,బాలికల అక్రమ రవాణా పై అవగాహన



**నిడమానూరు,మార్చి 04(ప్రజాజ్యోతి)**

:బాల్య వివాహాలు , బాలికల అక్రమ రవాణా పై ముకుందాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడవో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా బాల్య వివాహాలు బాలికల అక్రమ రవాణా లింగ వివక్షత ,లైంగిక వేధింపుల పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్ వైజర్స్ సైదా బేగం ,ఫరీదా బేగం ,నిడమనూర్ హైస్కూల్ హెడ్ మాస్టర్ గౌతమ్, ముకుందాపురం హెడమాస్టర్ నాగజ్యోతి ,పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్స్ రాజేశ్వరి ,మణెమ్మ ,అరుణ ,అలివేలు, ఆశ కార్యకర్తలు తదితరులు,పాల్గొన్నారు.

# ఆమనగల్లు జాతరలో అపశృతి

**అగ్నిగుండం దాటుతుండగా పడిపోయిన భక్తులు**

**పలువురికి గాయాలు**

**పరిస్థితి చక్కదిద్దిన పోలీసులు, నిర్వాహకులు**

**వేములపల్లి,మార్చి 4(ప్రజాజ్యోతి) :**

నల్గొండ జిల్లా, వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో కొలువుదీరిన శ్రీపార్వతి రామలింగేశ్వర స్వామి జాతరలో బుధవారం తెల్లవారు జామున 4గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు అపశృతి చోటుచేసుకుంది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన శ్రీపార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏటా హోలీ పండుగ పర్వదినాన పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. మంగళవారం మొదలైన జాతరకు జిల్లాతో పాటు వివిధ మండలాల, గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో జాతర కన్నుల పండువగా కొనసాగింది. జాతరలో ప్రతి సంవత్సరంలాగానే అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకి అగ్నిగుండం దాటుతుండగా,భక్తులు తన మొక్కుల్లో భాగంగా పల్లకి వెనకాలే అగ్నిగుండం దాటుతున్న క్రమంలో ఆదుపుతప్పి పలువురుఅగ్నిగుండంలో పడి పోయారు. దీంతో పలువురికితీవ్రగాయాలయ్యాయి. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనతో ఉన్నట్టుండి ఒక్క సారిగా జాతరలో భయంకరమైన అరుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఏం జరుగుతుందో తెరుకునేలోపే ప్రమాదం చోటు చేసుకుంది.దీంతో వారి పై నుంచే మిగితా భక్తులు దాటివేళ్లారు. బందోబస్తు నిర్వహిస్తున్న వేములపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు, మాడుగులపల్లి ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది, ఆలయ కమిటీ నిర్వాహకులు,ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మెరుపు వేగంతో స్పందించారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వారిని అగ్నిగుండం నుంచి బయటికి తీశారు.దీంతో పెనుప్రమాదం తప్పినట్లు అయింది. పోలీసులు, నిర్వాహకులు స్పందించిన తీరును అక్కడున్న భక్తులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.



# కోదాడ మండలంలో మద్యం మాఫియా 'బరితెగింపు'

**పట్టణ వైన్స్‌లు, బార్ల నుండే పల్లెలకు అక్రమ రవాణా!**

**గణపవరానికి తరలిస్తున్న రూ. 2 లక్షల మద్యం సీజ్..**

**కోదాడ రూరల్ పోలీసుల మెరుపు దాడి**

**- ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకే 'హోమ్ డెలివరీ'..**

**వైన్ షాపుల మధ్య పెరిగిన 'ఆటో యుద్ధాలు'**

**- నిమ్మకు నీరెత్తినట్లు ఎక్సైజ్ అధికారులు..**

**- మామూళ్ల మత్తులో నియంత్రణ వ్యవస్థ!**

**కోదాడ రూరల్.మార్చి 4 (ప్రజా జ్యోతి):**

కోదాడ మండలంలో మద్యం దందా అన్ని హద్దులను దాటేసింది. చట్టబద్ధంగా లైసెన్స్ పొందిన దుకాణాలు ఇప్పుడు అక్రమ నెట్‌వర్క్‌లకు అడ్డాగా మారాయి. పట్టణ కేంద్రంలోని వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు లాభార్జనే ధ్యేయంగా పల్లెల్లో 'లిక్కర్ వార్'కు తెరలేపాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే విక్రయించాల్సిన మద్యం, ఇప్పుడు ఆటోల ద్వారా గడప గడపకూ చేరుతోంది.గ్రామాల్లోని బెల్ట్ షాపులు ఇప్పుడు కేవలం విక్రయ కేంద్రాలుగా మాత్రమే కాకుండా, ఏకంగా 'మినీ బార్ల'ను తలపిస్తూ సిట్టింగ్ ఏర్పాట్లతో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ, సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ నెట్‌వర్క్ తాజాగా కోదాడ రూరల్ పోలీసులు జరిపిన తనిఖీల్లో బట్టబయలైంది.

**గణపవరం ఆటో సీజ్.. బయటపడ్డ నెట్‌వర్క్**

ఇటీవలే కోదాడ పట్టణం నుండి గణపవరం గ్రామానికి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో కోదాడ రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఆటోలో తరలిస్తున్న సుమారు రెండు లక్షల రూపాయల విలువైన భారీ మద్యం సరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న సూత్రధారులెవరో ఆరా తీస్తున్నారు. పట్టణంలోని పేరుగాంచిన వైన్ షాపుల నుండే ఈ స్టాక్ తరలుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**ఎమ్మార్పీ కంటే తక్కువకే..**



షాపుల మధ్య నెలకొన్న వ్యాపార పోటీ అక్రమాలకు కొత్త రూపునిచ్చింది. తమ షాపుల్లో సేల్స్ పెంచుకుని 'టార్గెట్లు' పూర్తి చేయడం కోసం కొంతమంది యజమానులు ఎమ్మార్పీ ధర కంటే తక్కువకే మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని బార్ అండ్ రెస్టారెంట్లు ఇప్పుడు పల్లెల్లోని బెల్ట్ షాపులకు ప్రధాన సరఫరా కేంద్రాలుగా మారాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఆటోల ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్ల వద్దకే మద్యం చేరవేసే 'డోర్ డెలివరీ' వ్యవస్థను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.మద్యం సిండికేట్ల మధ్య నెలకొన్న పోరు ఇప్పుడు వీధి పోరాటాలకు దారితీస్తోంది. ఒక వైన్ షాపునకు చెందిన ఆటో మరో షాపు 'అడ్డా'గా భావించే గ్రామానికి వెళ్తే, ప్రత్యర్థి షాపు మనుషులు ఆ ఆటోలను మార్గమధ్యంలోనే అడ్డగిస్తున్నారు. "మా ఊరికి వేరే షాపు మద్యం ఎలా వస్తుంది?" అంటూ నడిరోడ్డుపైనే వాగ్వాదానికి దిగడం, కొన్నిసార్లు ఒకరి ఆటోలను ఒకరు అడ్డగించుకుంటూ ఘర్షణలకు పాల్పడటంతో మండలంలోని ప్రధాన రహదారులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ 'లిక్కర్ వార్' కారణంగా సామాన్య ప్రయాణికులు సైతం బెంబేలెత్తుతున్నారు.మండలంలో ఇంత అరాచకం జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడపా దడపా చిన్న చితకా బెల్ట్ షాపులపై దాడులు చేసి, ఐదు పది బాటిళ్లు పట్టుకుని భారీ కేసుగా చిత్రీకరిస్తున్నారే తప్ప, ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు వైన్స్, బార్ యజమానుల జోలికి వెళ్లడం లేదు. అధికారుల ఉదాసీనత, మామూళ్ల మత్తులో వారు జోగుతుండటం వల్లే కోదాడలో మద్యం మాఫియా ఇంతగా రెచ్చిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వినాశనమవుతున్న పల్లెలు.. యువత అంధకారం!**

గ్రామాల్లోని బెల్ట్ షాపులు ఇప్పుడు రూపు మార్చుకున్నాయి. కిరాణా కొట్టు చాటున సాగే ఈ దందాలో ఇప్పుడు ప్రత్యేకంగా 'సిట్టింగ్' గదులు వెలిశాయి. వైన్స్, బార్ల యాజమాన్యాల ప్రోత్సాహంతో బెల్ట్ షాపు నిర్వాహకులు అక్కడే కూర్చుని తాగేందుకు నీళ్లు, గ్లాసులు, స్నాక్స్ వంటి సౌకర్యాలు



కల్పిస్తున్నారు. రాత్రి 11 గంటలైనా, తెల్లవారుజామున 5 గంటలకైనా ఇక్కడ మద్యం ఏరులై పారుతోంది. ఈ సిట్టింగ్ సెంటర్ల వల్ల గ్రామాల్లో తాగుబోతుల అరాచకాలు పెరిగిపోయి మహిళలు, విద్యార్థులు అడుగు బయటకు వేయాలంటేనే భయపడుతున్నారు.బెల్ట్ షాపుల పుణ్యమా అని గ్రామాల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉండటంతో కూలీనాలీ చేసుకునే సామాన్యులు, యువత మద్యానికి బానిసవుతున్నారు. గొడవలు, కుటుంబ కలహాలు పెరిగి పేద కుటుంబాలు వీధిన పడుతున్నాయి. అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపుల వద్ద మద్యం ప్రియుల సందడితో మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.చౌక ధరకే మద్యం అందుబాటులో ఉండటంతో పల్లెల్లోని యువత, కూలీనాలీ చేసుకునే వారు మద్యానికి బానిసవుతున్నారు. ప్రతి వీధిలోనూ వెలిసిన అక్రమ బెల్ట్ షాపుల వల్ల గ్రామాల్లో ప్రశాంతత కరువైంది. కుటుంబ కలహాలు పెరిగి మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి కోదాడలో సాగుతున్న ఈ 'మద్యం మాఫియా' ఆట కట్టించాలని, అక్రమాలకు పాల్పడుతున్న వైన్ షాపులు, బార్ల లైసెన్సులను రద్దు చేయాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# మునగాల మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం -- ఇద్దరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

**మునగాల మార్చి 04 (ప్రజా జ్యోతి):-**

సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆకుపాముల గ్రామ శివారులోని కోళ్ల ఫారం దాటిన తర్వాత ఎంఎస్ కాలేజీ ఎదురుగా హైదరాబాద్ నుండి కోదాడ వైపు వెళ్తున్న టీఎస్-29-టి-ఏ-1203 నంబర్ గల షిఫ్ట్ డిజైర్ కారు అతివేగం, డ్రైవర్ అజాగ్రత్త కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మైలురాయిని ఢీకొట్టి చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి



వెళితేమొగలైకోట గ్రామానికి చెందిన కన్నెదార దావీదు (26), కొండ్రు వంశీ (28), పెద్ద పంగు వెంకటి (55) మరియు జగ్గయ్యపేట మండలం బోదవాడ గ్రామానికి చెందిన మార్చుభూడి రాజకుమార్ (42) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.వారి బంధువైన అనంతగిరి మండలం మొగలాయికోట గ్రామానికి చెందిన కిన్నెర పుల్లయ్య మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకు హాజరుకావడానికి హైదరాబాద్ నుండి మొగలైకోటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. కారు నడుపుతున్న కిన్నెర దావీదు అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదం సంభవించినట్లు



పోలీసులు తెలిపారు.

**గాయపడిన వారికి చికిత్స**

మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, గాయపడిన వారిని మెరుగైన వైద్య చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు మునగాల ఎస్సై బి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. కిన్నెర దావీదు బాబాయి కిన్నెర కాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు చెప్పారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ**

ప్రమాద విషయం తెలుసుకున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ (ఐపీఎస్) సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు భద్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై ప్రవీణ్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# 6న ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశం

**ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక నిర్వహణపై ఈనెల 6 న నల్గొండలో ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశం**

**హాజరుకానున్న ఉమ్మడి జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు**

**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుండి 12 వరకు 99 రోజులపాటు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు**

**అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం**

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాలన్నింటిలో గ్రామస్థాయి మొదలుకొని జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులు అందరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. అధికారులందరూ



వారంలో కనీసం నాలుగు రోజులు క్షేత్ర స్థాయిలో ఉండాలని, నిబద్ధతతో, బాధ్యతగా పనులు నిర్వర్తించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా వివిధ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నదని, ఇందులో ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, ఫైల్స్ క్లియరెన్స్, ఆరోగ్యం, విద్య సంక్షేమం, వ్యవసాయం, మహిళలు, యువత, క్రీడలు, పర్యావరణం, డ్రగ్స్ నివారణ, రహదారి భద్రత తదితర అంశాలపై షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామసభలు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులందరినీ భాగస్వామ్యం చేయాలని చెప్పారు . ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టే ప్రత్యేక పనులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా జిల్లాలో అభ్యుదయ రైతుల ప్రోత్సాహం, ఆయిల్ పామ్ పంటలు, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య కార్యక్రమాలు, ప్రత్యేకించి హెచ్ పి వి వ్యాక్సినేషన్, సోలార్



విద్యుత్, జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచే కార్యక్రమాలు, పిల్లలకు గుణాత్మక విద్య అందించడం, డ్రగ్స్ నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ, జాబ్ మేళా నిర్వహణ, పర్యావరణంలో భాగంగా నర్సరీల పంపకం, వివిధ పథకాల కింద ఇప్పటివరకు లబ్ధిదారులకు చేకూర్చిన లబ్ధి వంటి వాటిని గ్రామ సభలలో వివరించడం, యువజన వారోత్సవంలో భాగంగా నిర్వహించే మండల స్థాయి కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు భాగస్వాములు కావాలని, అలాగే అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమాల వంటివి నిర్వహించాలని చెప్పారు. ఈనెల 6 న అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలలో శానిటేషన్ కార్యక్రమాలతో పాటు, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా ఆయా శాఖల వారిగా సాధించిన అభివృద్ధిపై ప్రజలందరికీ తెలియజేయాలని, అన్ని కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం ఉండాలని, వీలైనంతవరకు గ్రామసభల్లో లబ్ధిదారులతో మాట్లాడించాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా అంశాల వారిగా నిర్వహించాల్సిన పనులపై సంబంధిత శాఖల అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ డి ఓ లు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# గంధ మల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగులోకి గోదావరి జలాలు అందించి రైతాంగాన్ని ఆదుకుంటా .. ఎమ్మెల్యే మందుల సామేలు

**అడ్డగూడూరు ఫిబ్రవరి 04 (ప్రజా జ్యోతి )**

గంధ మల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగులోకి గోదావరి జలాలను తీసుకువచ్చి రైతాంగాన్ని ఆదుకునే బాధ్యత తనదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు.బుధవారం మండల పరిధిలోని చిన్న పాడిశాల, జానకిపురం గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా 10 లక్షలు నిధులతో ప్రభుత్వం మహిళా సమైక్య భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని వారం రోజుల్లో గంధ మల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగులోకి గోదావరి నీళ్లను తీసుకొచ్చి పంటలు ఎండిపోకుండా రైతాంగాన్ని ఆదుకునే బాధ్యత తనదని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు మహిళలు ఆత్మగౌరవంగా ఉండాలని



మహిళా సంఘాల భవనాలకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందన్నారు మండలంలో ఉన్న అన్ని గ్రామపంచాయతీలో సిసి రోడ్లు,సైడ్ డ్రైనేజీలు నిర్మించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు ఉచితంగా గృహ వినియోగదారులకు 200 యూనిట్లు, సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, ఎంపీడీవో శంకరయ్య, తహసిల్దార్ శేషగిరిరావు రావు, చిన్న పడిశాల సర్పంచ్ పూజారి సులోచన భిక్షమయ్యగౌడ్, జానకిపురం సర్పంచ్ ననుబోతు అనిత సమ్మయ్య యాదవ్, చిర్ర గూడూరు సర్పంచ్ చింతలూరి సోమనారాయణ, మార్కెట్ కమిటీ యాదయ్య, మహిళా సంఘాల అధ్యక్షులు,మహిళలు పాల్గొన్నారు.

# ముకుందాపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ స్థల పరిశీలన

## ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లాకన్వీనర్ ఏపూరి రాజు మాదిగ



**మునగాల మార్చి 04 ( ప్రజా జ్యోతి):-**

మునగాల:మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో మాదిగ గ్రామపెద్దలు మహిళలు, యువకులు హైవే పక్కన ఉన్నటువంటి మాదిగ కమ్యూనిటీ హాల్ స్థలంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహంతో పాటు స్థల పరిశీలన కార్యక్రమంలో,ఏపూరి రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ పాల్గొనడం జరిగినది,అనంతరంమాట్లాడుతూ ఇట్టి స్థలంలో గత గ్రామపంచాయతీ సర్పంచ్ హయాంలోనే అంబేద్కర్ విగ్రహం పెట్టడానికి నామకరణం చేపట్టడం జరిగిందని అలాగేముకుందాపురం గ్రామంలో ఉన్నటువంటి నిరుపేద మాదిగ కుటుంబానికి చెందినవారు గత 10 సం// స్కూల్ బిల్డింగును కమ్యూనిటీ హాలుగా ఉపయోగించుకోవడం జరుగుతున్నది. కాబట్టి ముకుందాపురం గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దలు, అన్ని వర్గాల ప్రజలతోపాటు సంబంధిత అధికారులు మహానుభావుడు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు సహకరించాలని తెలియజేశారు, ఈకార్యక్రమంలో, ఎమ్మార్పీఎస్ జిల్లాప్రధానకార్యదర్శి పాతకోట్ల నాగరాజు మాదిగ, ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు లంజపల్లి శ్రీను మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, మాజీ ఎంపిటిసి తాళ్లపాక వెంకట్రావు, కాలనీ పెద్దలు తాళ్లపాక బిక్షం కొమ్ము నాగేశ్వరరావు,తాళ్లపాక ప్రకాష్,బొడ్డుపల్లి ఆదాం, తాళ్లపాక బాబు,మంగళపెల్లి ముత్తయ్య, బండారు నాగరాజు, మాదాసు సైదయ్య, తాళ్లపాక పుల్లయ్య, తాళ్లపాక అజయ్, మాదా సాయి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య కళ్యాణ మహోత్సవ వేడుకలు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 04(ప్రజాజ్యోతి)**

:సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వార్డు కుప్పిరెడ్డిగూడెంలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయంలో గోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ కళ్యాణంను బుధవారం వైభవంగా నిర్వహించారు.ప్రత్యేక వేదికలపై ఉత్సవ విగ్రహాలతో వేదమంత్రాల నడుమ భక్తుల సమక్షంలో ఈ కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ తల్లిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటి శేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన



**హాలియా,మార్చి4(ప్రజా జ్యోతి)**

పదవ తరగతి ఇంటర్నల్ మార్కులను బుధవారం జిల్లా మానిటరింగ్ టీం అధికారులు పరిశీలించారు.మండలంలోని పులిమామిడి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులఇంటర్నల్ మార్కుల రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి ముచ్చర్ల సీనయ్య మాట్లాడుతూ పది ఫలితాల్లో అనుముల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేషు,శైలజ, ఉపాధ్యాయులు అంజయ్య, రమేష్ స్థానిక ఉపాధ్యాయులు నరసింహ చారి,రవీంద్ర చారి,కొల్లు శ్రీనివాస్ రెడ్డి,ఉమారెడ్డి,సంధ్యా వినోద తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమగ్రాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

## సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 04(ప్రజాజ్యోతి):గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు.ఈనెల 2 నుండి 7వ తేదీ వరకు 3వ విడత సూర్యాపేట , ఆత్మకూర్ (ఎస్), మునగాల, చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల సర్పంచులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచులు పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.గ్రామపంచాయతీ పనుల నిర్వహణ,గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి ఒక్క సర్పంచ్ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని, సాంకేతిక అంశాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా ప్రజా సౌకర్యాలపై మరింత శ్రద్ధ పెట్టవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



# కొలనుపాక బ్రిడ్జి పనులు పరిశీలన

## ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఆలేరు మార్చి 4 ప్రజా జ్యోతి**

రైతులకు సకాలంలో సాగునీరు అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కొలనుపాక బ్రిడ్జి పనులు ఎంతవరకు జరిగాయని తెలుసుకొని బుధవారం జరుగుతున్న పనులను ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించబోతున్న బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా సందర్శించి పురోగతిని తెలుసుకున్నారు. కాలువ ద్వారా వచ్చే సాగునీటిని కింది ప్రాంతాల పొలాలకు సమర్థవంతంగా మలించే విధంగా సాంకేతిక చర్యలు చేపట్టాలని గుత్తేదారుకు స్పష్టమైన సూచనలు చెప్పారు. నీటి ప్రవాహం అడ్డంకులు లేకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు గొట్టం విజేందర్రెడ్డి, చాడ



రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నూతనకల్..మార్చి04 (ప్రజా జ్యోతి):**

తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకులు శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నకిరెకంటి వెంకన్న బండపల్లి సాగర్ గౌడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ లింగాల రామచంద్రయ్య గొడిశాల లింగన్న గౌడ్ మంగళపల్లి నారాయణ చిర్ర శ్రీనాథ్ కొండ్ర గణేష్ మహేష్ నవిలే ఉపేందర్ తదితరులు ఉన్నారు.

# షారాజీపేటలో ఘనంగా హోలీ సంబరాలు



**ఆలేరు మార్చి 4 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షారాజీపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ కంతి మధు ఆధ్వర్యంలో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు రంగులు పూసుకుని సంతోషం వ్యక్తం చేశారు. వరుసలు లేకుండా ఆడే ఆటలు హోలీ అంటారన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు నాగరాజు, మహేష్, కిష్టయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మజాహర్

**నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు డా. చీమ శ్రీనివాస్**

కోదాడ టౌన్, మార్చి 04 ( ప్రజా జ్యోతి):
తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కోదాడ పట్టణానికి చెందిన ఎండి మజాహర్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించారు. బుధవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. మజాహర్ గతంలో సూర్యాపేట జిల్లా కన్వీనర్‌గా ఉండి, ఉద్యమకారుల సమస్యల పరిష్కారంలో చురుగ్గా పనిచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన అందించిన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీలో ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు చీమ శ్రీనివాస్ తెలిపారు.



# అక్రమంగా మట్టి తరలిస్తున్న 2 టిప్పర్లు,2 ట్రాక్టర్ల పట్టివేత

**మిర్యాలగూడ, మార్చి 04,( ప్రజాజ్యోతి ):**

ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు,రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై ఎం.లక్ష్మయ్య తెలిపారు. బుధవారం పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా ఆలగడప టోల్ గేట్ వద్ద నేరేడుచర్ల నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న మట్టిటిప్పర్లను అదుపులోకి తీసుకొని డ్రైవర్లను ప్రశ్నించగా ఎలాంటి అనుమతులు లేవని తెలపడంతో స్టేషన్కు తరలించారు. కాల్వపల్లి నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న మట్టి ట్రాక్టర్లను నిలిపి ప్రశ్నించగా వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనలపై వాహన యజమానులు, డ్రైవర్ల పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.





అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మయ్య హెచ్చరించారు.

# సైబర్ మాయగాళ్లతో జాగ్రత్త, అప్రమత్తతే రక్షణ కవచం

**రామాపురం క్రాస్ రోడ్డులో కోదాడ రూరల్ పోలీసుల భారీ అవగాహన సదస్సు**

**అపరిచితులకు ఓటీపీ లు, వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు**

**మోసపోతే వెంటనే '1930'కు కాల్ చేయండి: పోలీసుల సూచన**

**కోదాడ రూరల్, మార్చి 4 ( ప్రజా జ్యోతి ):**

ప్రస్తుత ఆధునిక కాలంలో సాంకేతికత ఎంతగా విస్తరిస్తుందో, అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, వారి మోసపూరిత వలలో పడకుండా ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోదాడ రూరల్ పోలీసులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్ వద్ద బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో "సైబర్ నేరాలపై అవగాహన - నివారణ మార్గాలు" అనే అంశంపై భారీ బహిరంగ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ,సైబర్ నేరగాళ్లు రకరకాల మార్గాల్లో సామాన్యులను దోచుకుంటున్నారని వివరించారు. ముఖ్యంగా కేటుగాళ్లు బ్యాంక్ మేనేజర్లమని, ఇన్సూరెన్స్ అధికారులమని నమ్మబలికి ఖాతా వివరాలు సేకరిస్తున్నారని మండిపడ్డారు. "మీకు లాటరీ తగిలింది", "కేవైసి అప్డేట్ చేయాలి", "విద్యుత్ బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తాం" వంటి బెదిరింపు లేదా ఆశ చూపే మెసేజ్‌ల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏ బ్యాంక్ అధికారి కూడా ఫోన్ లో ఓటీపీలు, పిన్ నంబర్లు అడగరని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ వాడుతున్న యువత సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న హనీ ట్రాప్, లోన్ యాప్ ల వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ ఎత్తవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేస్తే ఫోన్ లోని డేటా మొత్తం సైబర్ దొంగల పరమవుతుందని హెచ్చరించారు.గోల్డెన్ అవర్ - 1930 ప్రాముఖ్యత వివరిస్తూ,ఒకవేళ పొరపాటున ఎవరైనా సైబర్ మోసానికి గురై డబ్బులు కోల్పోతే, మొదటి రెండు గంటలను (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని తెలిపారు. బాధితులు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే, ఆ డబ్బు సంబంధిత అకౌంట్ల నుండి వేరే చోటికి వెళ్లకుండా పోలీసులు ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఫిర్యాదు చేయడంలో జాప్యం చేస్తే నగదు తిరిగి రాబట్టడం కష్టమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది అందే శ్రీనివాసరావు, సతీష్, సంకీర్తన్ రెడ్డి, సుధీర్, రవికిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొని ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడి

**కాంగ్రెస్ మాదిగలకు రాజ్యసభ స్థానాన్ని కేటాయించాలి.**

**లోక్ సభ స్థానాల్లో మాదిగలకు ఒక టికెట్ కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ అన్యాయం చేసింది**

**అధిష్టానాన్ని ఒప్పించి మాదిగలకు రాజ్యసభ వచ్చేలా చూడాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదే**

**-ఎంఎస్పీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ**





**నల్గొండ మార్చి 4 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి ప్రస్తుతం భర్తీ కాబోతున్న రాజ్యసభ స్థానాలలో కాంగ్రెస్ మాదిగలకు ఒక స్థానం ఇవ్వాలని , గత లోక్ సభ ఎన్నికల్లో ఒక్క టికెట్ కూడా ఇవ్వకుండా మాదిగలకు చేసిన అన్యాయాన్ని



ఇప్పటికైనా సరిదిద్దుకోవాలని ఎంఎస్పీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సునీల్ మాదిగలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం నుండి మాదిగలకు పార్లమెంట్ లో రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా కుట్రలు చేస్తుందని అన్నారు.ప్రస్తుతం తెలంగాణ నుండి పార్లమెంట్ లో ఒసిలకు, బీసీలకు, ఎస్టీలకు అలాగే ఎస్సీలలో మాలలకు ప్రాతినిధ్యం ఉందని అన్నారు. కానీ ప్రాతినిధ్యం లేని కులం మాదిగలు మాత్రమే అని అన్నారు. ఇప్పటికే రాజ్యసభలో ప్రాతినిధ్యం కలిగి ఉన్న రెడ్డి, బీసీ సామాజిక వర్గానికి ఇచ్చే బదులు అసలే రాజకీయ ప్రాతినిధ్యం లేని మాదిగలకు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని అధిష్టానాన్ని ఒప్పించి న్యాయం చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీదనే ఉందని అన్నారు. రాజ్యసభ స్థానాల్లో మాదిగలకు న్యాయం జరిగే వరకు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు అవసరమనుకుంటే ఎమ్ ఆర్ పి ఎస్ ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నియోజకవర్గ ఇన్చార్జి మధ్య దేవయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపా అధ్యక్షులు మాచర్ల సుదర్శన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు మాసారం వెంకన్న మాదిగ, ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చిన్న మాదిగ, కందుల మోహన్ మాదిగ, వంగూరి ప్రసాద్, ఏర్పుల శ్రవణ్ కుమార్, రాజు, బొజ్జ నరసింహ, లింగస్వామి, ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య యువజన జిల్లా సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 04(ప్రజాజ్యోతి)**

:విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ ట్రెజరర్ చల్లా లక్ష్మీకాంత్,జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు బొమ్మిడి అశోక్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ 2లో పదవ తరగతి విద్యార్థులకు యామ సంతోష్, శ్రీరంగం రాము పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా చల్లా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంను సాధించే విద్యార్థికి 5116 రూపాయల నగదు బహుమతిని అందజేస్తానని ప్రకటించారు.అనంతరం బొమ్మిడి అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని అన్నారు.ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని ఉత్తమ ఫలితాలను సాధించాలని అన్నారు.విద్యతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.యామ సంతోష్, శ్రీరంగం రాము మాట్లాడుతూ రానున్న పదవ తరగతి ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతను సాధించాలని అన్నారు.ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి చూసి ఓర్వలేక ఎమ్మెల్యే వేముల వీరేశం పై విమర్శలు

**నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ను విమర్శిస్తే ప్రజలు బుద్ధి చెప్తారు**

**ఎమ్మెల్యే వేములపై చిరుమర్తి చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి....**

**మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోగల దేవదాస్**

**చిట్యాల మార్చి 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చేస్తున్న అభివృద్ధిని చూసి



ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి ఆరోపణలు చేయడం తగదని మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీత రమేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండిస్తూ చిట్యాల పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బిఆర్ఎస్ పార్టీలోకి పోయి నకిరేకల్ నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశావో మాజీ ఎమ్మెల్యే తెలపాలని సందర్భంగా డిమాండ్ చేశారు. దళిత వ్యక్తినైన నన్ను ఇబ్బందులకు గురి చేయలేదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో 2 సీట్లు గెలిచి ఎమ్మెల్యే వేముల వీరేశం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు చేస్తూ మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఇప్పటికైనా బురద జల్లే రాజకీయాలు మానుకొని వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. మున్సిపాలిటీ చైర్మన్ పందిరి గీతా రమేష్ మాట్లాడుతూ అప్పుల పాలైన తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి వైపు తీసుకెళ్తుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులందరికీ అందిస్తూ అభివృద్ధి చేస్తుందని నకిరేకల్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం అభివృద్ధి చేస్తుంటే విమర్శలు చేయడం తగదని వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, కౌన్సిలర్లు కోనేటి ఎల్లయ్య, దేశపాక లతా రాజేష్, బొబ్బలి సందీప రాంరెడ్డి, నాయకులు పాటి నర్సిరెడ్డి, పాటి మాధవరెడ్డి, బెల్లి సత్తయ్య, గాలి యాదయ్య దాసరి నరసింహ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కళ్ళజోళ్ళు అందజేసిన మేడి హరికృష్ణ



**చిట్యాల మార్చి 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొద్ది రోజుల క్రితం విద్యార్థులకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ నర్రా సురేందర్ రెడ్డి సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. అనంతరం పది మంది విద్యార్థులకు కళ్ళజోడు అవసరం అని తెలిపారు. ఆ పదిమంది విద్యార్థులకు బుధవారం నాడు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మేడి హరికృష్ణ చేతులమీదుగా కళ్ళజోళ్లను విద్యార్థులకు అందజేయడం జరిగింది. అనంతరం నర్ర సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికి కళ్ళు చాలా ప్రధానమైనవి వాటిని జాగ్రత్తగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు విటమిన్ ఏ కలిగిన పదార్థాలను పాలు గుడ్లు ఆకుకూరలు బాగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదయ్య ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల సమగ్ర పర్యవేక్షణ కమిటీ ఎన్నిక

**చిట్యాల మార్చి 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల సమగ్ర పర్యవేక్షణ కమిటీ బుధవారం నాడు ఏకగ్రీవంగాఎన్నుకోవడం జరిగింది. కమిటీ చైర్మన్ గా గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్, కన్వీనర్ గా మురాళ్ళ నవనీత, తురిమెళ్ళ కవిత, కమిటీ సభ్యులు సాపిడి ఉదయశ్రీ,మోపిడి దీప్తి, రాయల పల్లవి, మురాళ్ళ సంధ్యారాణి ఎన్నికయ్యారు. అనంతరం



సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలకు అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ ఆశా వర్కర్లు సభ్యులు పాల్గొన్నారు.

# అయోమయంలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్

**నీరు రాక వృధాగా మిగిలిపోనున్న చర్లగూడెం తదితర ప్రాజెక్టులు**

**ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి కి 440 మీటర్లు, వట్టెంకు 436 మీటర్ల ఎత్తు నుంచి నీటి సరఫరా కు ఈఎన్సీ నిర్ణయం**

**గందరగోళంలో మునుగోడు దేవరకొండ నియోజకవర్గాల ప్రజలు ఆశలు**

**440 మీటర్ల ఎత్తు గురించి పట్టింపు లేదని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలపై ప్రజల విమర్శలు**

**436 మీటర్ల ఎత్తు నుంచి రెండు వైపులా నీటి సరఫరా జరగాలి**

**కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ డిమాండ్**

**సంస్థాన్ నారాయణపురం,**

ఫిబ్రవరి 04, (ప్రజాజ్యోతి) : ఏదుల రిజర్వాయర్ నుంచి 440 మీటర్ల ఎత్తు నుంచి డిండి కాలువలకు కృష్ణ నీరు తీసుకపోవాలని ఈఎంసి తాజాగా నిర్ణయించడంతో దిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిస్థితి అయోమయంలో పడిపోయినట్లు విమర్శలు వెళ్ళు వెత్తుతున్నాయి. గత ఏడు దశాబ్దాలుగా మునుగోడు దేవరకొండ నియోజకవర్గాల ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు నీరు రాని పరిస్థితి దాపురించడంతో ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. దశాబ్దాల ప్రజల కలలు కళ్ళలు గానే మిగిలిపోయే ప్రమాదం ఏర్పడిందని విమర్శిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన అన్ని ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలన్నీ వృధాగా మిగిలే ప్రమాదం ఏర్పడడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. వేలకోట్ల రూపాయలు వెచ్చించి కృష్ణ నీరు వస్తుందని కడుతున్న చర్లగూడెం తో పాటు అనుబంధ ప్రాజెక్టులన్ని వృధాగా మారే అవకాశాలు ఉన్నాయని రిటైర్డ్ ఇంజనీర్ ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదుల రిజర్వాయర్ నుంచి ఇటు డిండి కాలువలకు, అటు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటిని 436 మీటర్ల ఎత్తు నుంచి తీసుకు వెళ్లాలని నిర్ణయించి పనులు చేపట్టారు. ప్రాజెక్టుల ఈఎన్సీ డిజైనింగ్ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి కాలువకు నీళ్లు తీసుకువెళ్లే ఎత్తును మరో నాలుగు మీటర్లు ఎత్తు పెంచి 440 మీటర్లుగా నిర్ణయించారు. అదే ఏదుల రిజర్వాయర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటిని తీసుకువెళ్లే వట్టెం రిజర్వాయర్ కు మాత్రం 436 మీటర్ల ఎత్తు నుంచి నీటి సరఫరాను కొనసాగించాలని ఈఎంసి నిర్ణయించడంతో గందరగోళం నెలకొన్నది. దీనితో ఒకే ప్రాజెక్టు నుంచి ఒక వైపు 440 మీటర్ల ఎత్తు నుంచి, మరోవైపు 436 మీటర్ల ఎత్తు నుంచి నీటిని సరఫరా చేయాలని నిర్ణయించడం దిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిస్థితి అయోమయంగా మారిపోయింది. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి కాలువలకు రోజుకు అర టీఎంసీ నీటిని, వట్టెం రిజర్వాయర్ కు ఒకటిన్నర సీఎంసీల నీటిని సరఫరాకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు కాలువలకు 436 మీటర్ల ఎత్తు నుంచి నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది. అందుకు అనుగుణంగానే 18 వందల కోట్ల రూపాయలను విడుదల చేసి ఏదుల రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. కానీ మహబూబ్నగర్ జిల్లా ప్రజా ప్రతినిధులు, ప్రజల ఒత్తిడి చేస్తున్నారనే కారణంతో అక్కడి జిల్లా ప్రాజెక్టుల ఇంజనీ రింగ్ అధికారులు ఈఎన్సి అధికారులు కలిసి డిండి కాలువలకు నీటిని వల్లించే ఎత్తును నాలుగు మీటర్లు పెంచి 440గా నిర్ణయించి సంతకాలు చేసినట్లుగా ఇంజనీరింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనితో 436 మీటర్ల ఎత్తు నుంచి రోజుకు ఒకటిన్నర టీఎంసీల నీరు నిరంతరం వట్టెం రిజర్వాయర్ కు వెళ్ళిపోతుండగా, 440 మీటర్ల ఎత్తు వరకు ఏదుల రిజర్వాయర్ లో నీటిమట్టం పెరిగితే తప్ప దిండి రిజర్వాయర్కు నీరు వచ్చే ఆస్కారమే లేకుండా పోయింది. ఈఎంసి అధికారుల తాజా నిర్ణయం వల్ల దేవరకొండ మునుగోడు నియోజకవర్గం కృష్ణా జలాలు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఆ నీటి కోసం ప్రభుత్వాలు వేలాది కోట్ల రూపాయలను వెచ్చించి నిర్మాణాలు చేస్తున్న ప్రాజెక్టులన్ని నీరు రాక వృధాగా మిగిలిపోయే ప్రమాదాలు నెలకొన్నాయి. అసలే వర్షాకాలంలో వరద జలాల రాకపై ఆధారపడి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులు ఈఎన్సీ అధికారుల నిర్ణయంతో అయోమయంలో పడిపోయినట్లు ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పట్టించుకోని నల్లగొండ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

దేవరకొండ మునుగోడు ప్రజల దశాబ్దాల కలలను నెరవేరుస్తామని ప్రకటిస్తున్న జిల్లా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రోడ్ల భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలు నాయక్ లు సైతం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 440 మీటర్ల ఎత్తు నీటి మళ్లింపు నిర్ణయం పై పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సొంత శాఖలోని ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా 436 మీటర్ల ఎత్తు కు బదులు 440 మీటర్ల ఎత్తు నుంచి నీటిని సరఫరా చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, ఈఎంసి నిర్ణయించి గత జనవరి నెలలో సంతకాలు చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గం మొత్తం నిర్ణయాన్ని సైతం అధికారులు వ్యతిరేకించడం వల్ల ఫ్లోరిన్, కరువు బాధితులైన మునుగోడు దేవరకొండ నియోజకవర్గం ప్రజల ఆశలు కృష్ణార్పణమయ్యే ప్రమాదం ఏర్పడిందని నిపుణులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలు హెచ్చరిస్తున్నారు. వెంటనే జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని పట్టించుకోని ముఖ్యమంత్రితో మళ్ళీ 436 మీటర్ల ఎత్తు నుంచి దిండి కాలువలకు నీటిని సరఫరా చేయడానికి కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


**ఉద్యమాలకు సిద్ధం అవుతున్న సిపిఎం టిఆర్ఎస్ పార్టీలు**

డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి 440 మీటర్ల ఎత్తులో నీటిని సరఫరా చేయాలని ఈఎంసి ఇంజనీరింగ్ అధికారులు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ త్వరలో ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లుగా సిపిఎం టిఆర్ఎస్ పార్టీల నాయకులు వివరి స్తున్నారు. 436 మీటర్ల ఎత్తు నుంచి డిండి కాలువలకు నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**436 మీటర్ల ఎత్తులోనే రెండు వైపులా నీటిని మళ్ళించాలి**

**కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్**

మునుగోడు దేవరకొండ ప్రజల దాహార్తిని తీర్చే డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి ఇటు డిండి, వట్టెం కాలువలకు 436 మీటర్ల ఎత్తు నుంచి సమాన స్థాయిలో నీటిని సరఫరా చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సైతం ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకుండా డిండి కాలువలకు వెళ్లే నీటి ఎద్దును 440 మీటర్లకు పెంచడం సరి అయింది కాదన్నారు. ఆ ఎత్తు నుంచి నీరు డిండి ప్రాజెక్టు కాలువలకు సరఫరా జరగవని వివరించారు. తక్షణం ఈ విషయమై మంత్రులు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. లేదంటే ఈ రెండు నియోజకవర్గాల ప్రజల ఆశలు ఎన్నటికీ నెరవేరవన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 04(ప్రజాజ్యోతి):ప్రజాపాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికల కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, సంక్షేమ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడం, సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు.యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు యూత్ వీక్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి టెలికమ్యూనికేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ల స్వీకరణ ఉంటుందని, ఇక నుంచి అన్ని ఫైళ్లు ఈ ఆఫీస్ ద్వారానే పంపాలని స్పష్టం చేశారు.ప్రత్యేక అధికారులు సంక్షేమ గృహాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని, టాస్క్ ద్వారా యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.ప్రణాళిక అధికారి ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రగ్స్ నివారణ, పిల్లల రక్షణ, భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా గ్రామసభల్లో చదివి వినిపించాలని, ఇందుకొరకు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రూ.500 లకే గ్యాస్, తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించి గ్రామసభల్లో చదివి వినిపించాలని సూచించారు. గ్రామసభల్లో లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. భూ సేకరణ, అటవీ అనుమతులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.మన ఊరు మనబడి పెండింగ్ బిల్లులపై నివేదిక సమర్పించాలని డిఈఓను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ సిబ్బందికి ప్రజాపాలన ప్రగతి కార్యాచరణలో చేపట్టనున్న కార్యక్రమాలపై వివరించాలని సూచించారు.జరిగిన కార్యక్రమాల పై ప్రతిరోజు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.యూరియా యాప్ వినియోగం తదితర అంశాలపై రైతులతో అవగహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు

## మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేగా వేములను కలిసిన సుందర్



**చిట్యాల మార్చి 04 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

: చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని అంబికా రాజరాజేశ్వరి దేవాలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరము నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశమును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే సుందర్ కి కేక్ తినిపించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. వట్టిమర్తి వద్ద ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేసి మాట్లాడుతూ పుట్టినరోజు వృద్ధాశ్రమంలో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆశ్రమంలో ఉన్నటువంటి వృద్ధులకు తనకు చేతనైన సహాయం ఎల్లప్పుడూ అందిస్తూనే ఉంటాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కాటం వెంకన్న, ఉపసర్పంచ్ బెల్లంకొండ లావణ్య రఘు, వార్డు మెంబర్లు మల్ల పరమేశ్వరి ప్రశాంత్ దేశపాక మధు, వలిగొండ లింగమ్మ సోమయ్య శ్రీశైలం పొలిమేర దశరథ కొలిమిర శంకర్, కంభంపాటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.




# సహజ నీటి ప్రవాహ కాలువపై అధికారుల పరిశీలన



**చింతలపాలెం మార్చి 4 (ప్రజా జ్యోతి) :**

చింతలపాలెం మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 488లో నూతనంగా నిర్మాణంలో ఉన్న మెటల్ పవర్ కంపెనీ లిమిటెడ్ వద్ద సహజ నీటి ప్రవాహ వర్షాధార కాలువను పూడ్చివేయడంతో కిందికి నీటి ప్రవాహం నిలిచిపోయిందని స్థానిక రైతు దేవిరెడ్డి లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బుధవారం ఇరిగేషన్ శాఖ అధికారులు సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. జిపిఎస్ ఆధారంగా ఆ ప్రాంతంలో ఉన్న సహజ నీటి ప్రవాహ వర్షాధార కాలువ మార్గాన్ని గుర్తించి మార్కింగ్ చేశారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ శాఖ డీఈ హరిక్రిష్ణ, జేఈఈ శ్రీనివాస్, తహశీల్దార్ సోమపంగు సూరయ్య, అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ కు నల్లగొండ పోలీస్ కబడ్డీ క్రీడాకారిణి షైక్ నౌషీన్ ఎంపిక

**అభినందించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**తెలంగాణ రాష్ట్ర పోలీస్ కబడ్డీ జట్టుకు కెప్టెన్ గా**

**నల్లగొండ టౌన్, మార్చి 4 (ప్రజా జ్యోతి)**

నల్లగొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న షైక్ నౌషీన్ ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ - 2026 మీట్‌కు ఎంపికయింది. జమ్మకశ్మీర్ లో ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు జరిగే క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ కబడ్డీ జట్టుకు కెప్టెన్ గా వహించనున్నారు.4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2026 పోటీలు ఫిబ్రవరి 16 నుండి 21 వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం మరియు సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించబడ్డాయి. ఈ క్రీడా పోటీలలో యాదాద్రి జోన్ జట్టు తరఫున కబడ్డీలో బంగారు పతకం సాధించగా, 3వ పోలీస్ స్టేట్ మీట్ తరఫున రజత పతకం సాధించారు. ఈ రెండు సందర్భాల్లోనూ జట్టుకు కెప్టెన్‌గా నాయకత్వం వహించి విశిష్ట ప్రతిభ కనబరిచారు. షైక్ నౌషీన్ ఇప్పటివరకు 20 సార్లు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా 3 సార్లు ఇండియన్ క్యాంప్స్‌లో పాల్గొని తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకున్నారు. 2025లో పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ నగరంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును విజయవంతంగా నడిపించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, షైక్ నౌషీన్ ను అభినందిస్తూ, జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖ తరపున ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఘనంగా శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి 23వ వార్షిక మహోత్సవం

## ఆలయ చైర్మన్ మరగోని ఆంజనేయులు ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకల ఏర్పాట్లు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

**చిట్యాల మార్చి 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):**







చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి 23వ వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ అర్చకత్వంలో దేవాలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున సుప్రభాతము పంచామృతాలతో క్షీరాభిషేకం గణపతి పూజ స్వస్తి వాచనము మంటపారాధన నిర్వహించారు. అనంతరం దుర్గా హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తాననీ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ పందిరి గీత రమేష్, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు జేరిపోతుల సత్యనారాయణ, కుక్కల మోహన్, కోనేటి ఎల్లయ్య, బొబ్బలి సందీప రెడ్డి, గాలి యాదమ్మ లింగయ్య, నాగిళ్ళ సుధాకర్, డిసిసి జిల్లా కార్యదర్శి పోకల దేవదాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకన్న, పాటి నర్సిరెడ్డి, పాటి మాధవరెడ్డి,వనమా వెంకటేశ్వర్లు, బెల్లి సత్తయ్య, ఎద్దులపురి కృష్ణ,
పిశాటి భీష్మా రెడ్డి, సిలివేరు శేఖర్, ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, పల్లపు బుద్ధుడు, కంభంపాటి సతీష్, సల్లరాజు, ఆలయ డైరెక్టర్లు బుద్ద విమల కృష్ణమూర్తి, గంజి వెంకటేశం, వరకంతం నర్సిరెడ్డి, రుద్రరపు లింగస్వామి,జిట్టా సాయిలు, వనమా నిఖిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ భద్రతా వారోత్సవాలు

చింతలపాలెం, మార్చి 4 (ప్రజా జ్యోతి) : మండలంలోని అంజనీ పోర్ట్‌ల్యాండ్ సిమెంట్ లిమిటెడ్‌లో 55వ జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



వారోత్సవాల ప్రారంభ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. వెంకట్ రాజు జాతీయ భద్రతా జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ సంస్థలోని ప్రతి పనిలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సురక్షితమైన పని విధానాలు పాటించడం, ఇండక్షన్ ప్రక్రియను బలోపేతం చేయడం, ఉద్యోగులకు భద్రతా ప్రమాణాల అమలులో పూర్తి అధికారం కల్పించడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. సంస్థలో "జీరో హాని" సంస్కృతిని కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సీతా మెమోరియల్ స్కూల్ విద్యార్థులు భద్రతా సందేశంతో కూడిన స్కిట్‌ను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. వారాంతం వరకు నిర్వహించిన వివిధ భద్రతా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మేనేజింగ్ డైరెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ప్రధాన గేటు వరకు ర్యాలీ నిర్వహించి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, పెద్దిరాజు, దుర్గాప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ తల్లి కి మొక్కులు

## మొక్కులు సమర్పించిన మహిళలు

**ఆలేరు మార్చి 4 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శర్బనాపురం గ్రామంలో దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు గ్రామ మహిళలు నిర్వహించి మొక్కులు సమర్పించారు . ఈ



కార్యక్రమంలో మహిళలు సుదగాని సత్యలక్ష్మి, గడ్డమీది బుచ్చమ్మ, ఏదు హేమలత, గడ్డమీది లక్ష్మి, మంగమ్మ, వాని, రాధ, సుమలత, తదితరులు పాల్గొన్నారు

# డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

## కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ, ముస్లింలు సోదర భావంతో పనిచేస్తుంది

**నల్లగొండ మార్చి 4 (ప్రజా జ్యోతి )**

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆమేర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మిర్యాలగూడ రోడ్ లో విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా బషీర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ..ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ, ముస్లింలు సోదర భావంతో ఎలాంటి సంఘవిద్రోహశక్తులకు తావివ్వకుండా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ. హఫీజ్ ఖాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,



పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు నదీమ్, హాజీ, ఎంఐఎం నాయకుడు మోయిన్, మధుసూదన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, ప్రకాశం బజార్ వ్యాపారస్తులు ఇడుకుల నరసింహ, ఆంజనేయులు, శ్యామ్, నవీన్, వనమా అశోక్, అంజద్, నసీర్, మూవీస్, ఇసాక్, రియాజ్, అజ్జు, యూనుస్, ముసురఫ్, ఫర్హాన్, సైఫ్, పాషా తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ మిత్ర కోర్సుతో భవిష్యత్తుకు బాటలు

**భూదాన్ పోచంపల్లి, మార్చ్ 04 (ప్రజాజ్యోతి)**

మండలంలోని జలాలపూర్‌లో ఉన్న స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత సాంకేతిక శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ కిషోర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిజిటల్ మిత్ర) కోర్సులో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గలవారు 16.03.2026 లోపు సంస్థలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



# దశ దిన కర్మ కార్యక్రమం లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

## కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్ తండ్రి



**మునుగోడు, మార్చి, 04, (ప్రజా జ్యోతి,)**

మునుగోడు మండల కేంద్రంలో నీఎమ్ ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్ తండ్రి స్వర్గీయ నారబోయిన కనకయ్య దశదిన కర్మ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరియు పలువురు నాయకులు కలిసి కనకయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి వారికుటుంబ పర్మశించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీల హక్కుల కోసం చలో ఢిల్లీ

**బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 23న బీసీల చలో ఢిల్లీ**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**మునుగోడు, మార్చి, 04,( ప్రజా జ్యోతి)**

మండలకేంద్రంలోని సత్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజు ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలు సుదీర్ఘకాలంగా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని పోరాటం చేస్తున్నారని బీసీల పోరాటానికి స్పందించిన ప్రభుత్వం 42% రిజర్వేషన్ పెంచుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి ఢిల్లీకి పంపించి సంవత్సరన్నర కాలం అయినప్పటికీ నీటి వరకు బీసీ రిజర్వేషన్ల బిల్లు చట్ట రూపంలో రాకపోవడం చాలా దురదృష్టకరమన్నారు బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచడానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంట్ సమావేశాలలో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టాలని రాము డిమాండ్ చేస్తే, రెండు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీ ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేట్ బిల్లు పెడతామని హామీ ఆమె ఇవ్వడానికి స్వాగతిస్తున్నామని బీసీ



రిజర్వేషన్లు సాధించేవరకు గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటాన్ని ఆపేది లేదని ఢిల్లీ పాలకులపై ఒత్తిడి పెంచడానికి ఈనెల 23న ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద బీసీల మహాదమ్లను చేపడుతున్నట్లు ఈ మహా ధర్నాకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి రాజకీయ పార్టీల కచ్చితంగా బీసీలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు బూడిద లింగయ్య యాదవ్, ఆనగంటి కృష్ణ, బూడిద మల్లికార్జున్, ఈదులకంటి కైలాస్ వీరమల్ల కార్తీక్, గురుజా నరసింహ గౌడ్, కర్నాటి వెంకటేష్, సత్యం, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

# పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టి ఇవ్వాలి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్

**ఆలేరు మార్చి 4 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో సర్వేనెంబర్ 8లో ప్రభుత్వ భూమి అర్హులైన పేదలు గుడిసెలు వేసుకొని అర్హులైన పేదలు తమ భూమి పైన గుడిసెలు దగ్గర ఉండటం జరిగిందని ప్రభుత్వం తక్షణమే పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ



సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఇండ్ల స్థలం సాధించేవరకు పోరాటాన్ని సాగిస్తామని చెప్పే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి ,ప్రవీణ్ ,ఉపేందర్ ,అర్జున్, భవాని, సంపత్ ,సుశీల, సంధ్య ,బిక్షపతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పర్యటన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్

## పలు కుటుంబాల పరామర్శ

**నూతనకల్.. మార్చి04 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని రామలింగాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మూరగుండ్ల సైదులు తండ్రి చంద్రయ్య, మండల కేంద్రానికి చెందిన దేవి రెడ్డి మల్లారెడ్డి తండ్రి మారయ్య లు ఇటీవల మృతి చెందగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను తుంగతుర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ బుధవారం పరామర్శించారు. అనంతరం బిఆర్ఎస్వి గ్రామ శాఖ అధ్యక్షుడు కోత్వాల నరేష్ కు ప్రమాదవశాత్తు కాలుకు గాయం కావడంతో వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మున్న మల్లయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలు గౌడ్,స్థానిక సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ చురుకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి గాడిదల లింగరాజు యాదవ్ గూగుల్ కొటేష్ నాయక్ వార్డు సభ్యులు ఉప్పల వీరు యాదవ్ గోవర్ధన్ సురేందర్ సతీష్ నాయకులు గాజుల తిరుమలరావు,గుగులోత్ నర్సింగ్ నాయక్,మందడి సోమిరెడ్డి మొగుళ్ల వెంకన్న చూడి లింగారెడ్డి,కొచ్చర్ల బాబు, మొగుళ్ళ వెంకన్న రేసు వెంకటేశ్వర్లు



ఇమ్మారెడ్డి రవి,గోల్కొండ విశాఖ, మురళి,కనకటి మహేష్, కిరణ్,వీరమల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# సంపూర్ణ ఆరోగ్యానికి నడక తప్పనిసరి

**భూదాన్ పోచంపల్లి, మార్చ్ 04 (ప్రజాజ్యోతి)**

మనిషి నిత్య జీవనశైలిలో నడక (వాకింగ్) అనేది సంపూర్ణ ఆరోగ్యానికి అత్యంత కీలక వ్యాయామం అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నడక అనేది సులభమైన, ఖర్చు తక్కువ, కానీ శరీరానికి, మానసిక ఆరోగ్యానికి విస్తృత ప్రయోజనాలు కలిగిన వ్యాయామంగా నిలిచింది.

### హృదయానికి అనుకూలం

రోజువారీ వేగవంతమైన నడక, హృదయాన్ని సక్రియంగా ఉంచుతుంది, రక్తప్రవాహం మెరుగుపరుస్తుంది, మరియు రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. హృదయానికి వ్యాధి ప్రమాదాన్ని 30% వరకు తగ్గించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### మానసిక ఆరోగ్యం

నడక మానసిక ఆరోగ్యానికి కూడా మద్దతు ఇస్తుంది. నడక సమయంలో మస్తిష్కంలో ఎండోర్ఫిన్లు విడుదల కావడంతో మూడ్ మెరుగుపడుతుంది, ఆందోళన మరియు డిప్రెషన్ తగ్గుతుంది. నడక చేసే సమయంలో ప్రకృతిలో లలితమైన మార్గాలు, తోటలు, పూల వాసనలు మనసుకు సానుకూల ప్రభావం చూపుతాయి.

### మసిల్స్ మరియు ఎముకల బలం

నడక కేవలం హృదయానికి మాత్రమే కాదు, కాళ్ళు, మోకాళ్ళు, వెన్నెముక బలానికి కూడా మేలు చేస్తుంది. నడక సక్రమంగా చేస్తే ఆర్థరైటిస్, ఆస్తియోపోరోసిస్ వంటి ఎముక సంబంధ వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది.

### బరువు మరియు షుగర్ నియంత్రణ

నడక, శరీరంలో క్యాలరీలను ఖర్చు చేయడంతో బరువు నియంత్రణలో సహాయపడుతుంది. అలాగే, డయాబెటిస్ ఉన్నవారికి నడక రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యంగా ఉంచడంలో ఉపయోగపడుతుంది.



నడక కోసం నిపుణుల సూచనలు

రోజుకు కనీసం 30 నిమిషాల వేగవంతమైన నడక మంచిది.

ప్రారంభంలో మెల్లగా ప్రారంభించి, దూరం మరియు వేగాన్ని క్రమంగా పెంచాలి.

ఉదయం లేదా సాయంత్రం ప్రకృతి దృశ్యాలతో నడక చేయడం మానసిక శాంతికి కూడా ఉపకరిస్తుంది.

వారంలో కనీసం 5--6 రోజులు నడక చేయడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# కోదాడను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

## రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన అజెండా

## మే చివరి నాటికి రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పూర్తి కావాలి

## నాణ్యత విషయంలో రాజీపడితే సహించేది లేదు

## రూ. 14 కోట్లతో 4,500 ఎకరాలకు సాగునీటి భరోసా


## రికార్డు స్థాయిలో వరి కొనుగోళ్లు, రైతులకు రూ. 19,800 కోట్ల చెల్లింపులు

**కోదాడ రూరల్ , మార్చి 4 ( ప్రజాజ్యోతి ):**

కోదాడ నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి కష్టాలు తీర్చి, ప్రతి ఎకరాను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన నియోజకవర్గ పరిధిలోని కోదాడ మండలం పాలేరు వాగుపై నిర్మిస్తున్న రెడ్లకుంట ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులతో కలిసి ప్రాజెక్టు మ్యాపులను పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ



సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,రెడ్లకుంట ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, మే నెల చివరి నాటికి అన్ని హంగులతో పనులను పూర్తి చేసి రైతులకు అంకితం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. “ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు నీరు అందాలని, పనుల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదు” అని హెచ్చరించారు. ముఖ్యంగా సివిల్ పనులు, మోటార్ల బిగింపు ప్రక్రియలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.



### అట్టడుగు వర్గాలకు అండగా ‘ఎత్తిపోతలు’:

ఎస్సీ, ఎస్టీ, బీసీ బలహీన వర్గాల ప్రజలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. రూ. 14 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ రెడ్లకుంట ప్రాజెక్టు ద్వారా నల్లబండగూడెం, కాపుగల్లు, రెడ్లకుంట గ్రామాల్లోని సుమారు 4,500 ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందన్నారు. సాగునీటితో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యను కూడా ఈ ప్రాజెక్టు ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణ విషయంలో ఎక్కడా ఇబ్బంది లేకుండా 3 ఎకరాల 39 కుంటల భూమిని సేకరించి, రైతులకు ఇప్పటికే రూ. 2 కోట్ల నష్టపరిహారం చెల్లించామని వివరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్ లో రికార్డు స్థాయిలో 72 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండటం మన ప్రభుత్వ కృషికి నిదర్శనమని మంత్రి కొనియాడారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మద్దతు ధరతో పాటు బోనస్ మొత్తాన్ని కలిపి మొత్తం రూ. 19,800 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రాజకీయాలకు తావులేకుండా కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, పనులు పూర్తి చేయడంలో ఎక్కడా రాజీ పడబోమని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ మంత్రి పర్యటనలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్, ఆర్డీఓ సూర్యనారాయణ, ఇరిగేషన్ ఈఈలు, డీఈలు, కాంట్రాక్టర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తవరపు పాండురంగారావు, బుర్ర పుల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్ రెడ్డి, మండలపు శేషయ్య, ఈర్ల సీతారాం రెడ్డి, సాదినేని అప్పారావు, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, ముసుకు శ్రీనివాస్ రెడ్డి ,స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మంత్రి రాకతో రామాపురం, రెడ్లకుంట పరిసర ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది.



# శాశ్వత అంగన్వాడి కేంద్రానికి కృషి

**అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన**
**కౌన్సిలర్స్ సంపత్ రెడ్డి,సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్**

**హుజూర్నగర్, మార్చి 04 (ప్రజా జ్యోతి):**



వార్డులో శాశ్వత అంగన్వాడీ కేంద్రాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సీతారాంనగర్ లో గల అంగన్వాడి కేంద్రాన్ని 25 వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, మూడో వార్డు కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు, గర్భిణీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, నాణ్యమైన ఆహారం అందించాలని, పాల ప్యాకెట్ల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు.స్టోర్ రూమ్ లో చిన్న పిల్లలకు, గర్భిణీలకు ఇచ్చే గుడ్లను, బాలామృతం ప్యాకెట్స్ ను వారు పరిశీలించారు. సదుపాయాలకు సంబంధించిన విషయాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా రోజి అనే పాపతో అక్షర అభ్యాసం చేయించారు.అనంతరం అంగన్వాడి కేంద్ర నిర్వాహకురాలు ఎండి నజీమా బేగం కౌన్సిలర్లను ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బి ఎల్ వో సహారాబాను, అంగన్వాడీ ఆయా వరలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాల్లవుల వీరయ్య, తోట ఉపేందర్, ములకలపల్లి వెంకటేష్, మీసాల గోపి, తమ్మిశెట్టి నరసింహారావు, ములకలపల్లి శ్రీను, తురక రమేష్ పాల్గొన్నారు.

# ప్రమాద ప్రాంతాలను పరిశీలన

**- డి.ఎస్.పి రాజశేఖర్ రాజు**

**హాలియా,మార్చి4(ప్రజా జ్యోతి)**

సాగర్ ఎడమ కాలువ ప్రమాద ప్రాంతాలను బుధవారం మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు పరిశీలించారు. హోలీ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఇద్దరు యువకులు గల్లంతయిన నేపథ్యంలో డి.ఎస్.పి రాజశేఖర్ రాజు హాలియా పట్టణానికి ఆనుకొని ఉన్న నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాలువ ప్రమాద ప్రాంతాలను పరిశీలించి స్థానిక పోలీసులకు తగు సూచనలు చేశారు.ఎడమ కాలువ ప్రాంతాలైన శివాలయం రామాలయం తదితర ప్రాంతాల్లో కాలువలో బట్టలు ఉతకడం కోసం మహిళలు కాలువలోకి దిగడం ప్రమాదకరమని అన్నారు.ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా రక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రధాన ఎడమ కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండడం ద్వారా ప్రాణాంతకమని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట సిఐ దేవి రెడ్డి సతీష్ రెడ్డి,ఎస్ ఐ బండి సాయి ప్రశాంత్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# 15 ఏండ్ల కృషి ఫలించనుంది

**ఈనెల రెండో వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మోడల్ కాలనీ ప్రారంభం**

**-లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలి**

**-రేషన్ లో ఇచ్చే సన్న బియ్యంతో వెయ్యి కుటుంబాలతో భోజన ఏర్పాట్లు**

**-లబ్ధిదారుల కుటుంబాలతో సహపంక్తి భోజనం**

**-సుమారు 15 ఏళ్ల కృషి ఫలించనున్నది**

**-అవినీతికి ఆస్కారం లేదు**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హుజూర్ నగర్, మార్చి 4 (ప్రజా జ్యోతి):**

హుజూర్ నగర్ రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల రెండో వారంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు, ఆదర్శ గృహ కాలనీ ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు సమయం పనిచేసి అయినా వచ్చే ఒక వారంలో అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. హుజూర్నగర్ సమీపంలోని రామస్వామి గుట్టలో 110 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలనీ నిర్మించబడింది. ఇందులో 2,160 కుటుంబాలకు సింగిల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తాను గృహనిర్మాణ శాఖామంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

అయితే 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందని ఆయన పేర్కొన్నారు.

2023లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖా మంత్రిగా ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌కు ఎట్టకేలకు తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే తుదిదశకు చేరుకుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక రాజకీయ దురుద్దేశంతో ఈ పనులు ఆపివేశారని ఆయన ఆరోపించారు.నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతాన్ని చెత్త మైదానంగా మార్చేశారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఈ ప్రాజెక్ట్‌కు కొత్త ఊపిరి పోసింది, అని మంత్రి తెలిపారు.

110 ఎకరాల విస్తీర్ణంలో రూ.125 కోట్ల వ్యయంతో ఈ గృహ కాలనీ నిర్మించబడింది. మొత్తం 2,160 ఆధునిక సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మించి అంతే సంఖ్యలో కుటుంబాలకు వసతి కల్పించనున్నారు. ఈ భూమిని ఎండోమెంట్స్ శాఖ నుంచి పూర్తి మార్కెట్ విలువ చెల్లించి, చట్టబద్ధమైన అన్ని అనుమతులతో ప్రభుత్వమే కొనుగోలు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. అన్ని చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలనీ నిర్మాణం చేపట్టింది, అని మంత్రి వివరించారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతాన్ని సుసంపన్నమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లినట్లు తెలిపారు.

ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అత్యంత పేద కుటుంబాలు, నిరాశయులకు, నిరుపేద వ్యవసాయ కూలీలకు, రైస్ మిల్ కార్మికులు, ఏమీ లేని వారికి ఆశ్రయం, గూడు కల్పిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉంటుందన్నారు.మొదటి దశలో కేవలం 1,000 మంది లబ్ధిదారులను మాత్రమే ఖరారు చేస్తున్నామని అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె నరసింహ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్టికల్చర్ పిడి నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా డీసీసీ అధ్యక్షులు నరసయ్య, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు..

## ఐదోరోజూ ఇజ్రాయెల్, ఇరాన్ హోరాహోరీ దాడులు

**టెహ్రాన్:**

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారంనాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సలేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది.

### హెర్మేస్ డ్రోన్లను కూల్చేశాం: ఇరాన్

కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన హెర్మేస్ డ్రోన్‌ను కూల్చేసినట్టు కెర్మాన్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం తెలిపింది. గత 24 గంటల్లో మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ప్రకటించింది. మధ్యప్రాచ్యంలోని ఇరాక్ 'ఎర్బిల్ బేస్', కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్‌బేస్, అరిఫ్‌జాన్ ఎయిర్ బేస్ సహా అమెరికా సైనిక స్థావరాలపై ఇంతవరకూ 230 డ్రోన్లు పేల్చినట్టు తెలిపింది.

### 800కి చేరిన మృతుల సంఖ్య

ఇజ్రాయెల్ గత శనివారంనాడు టెహ్రాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి ఇంతవరకూ ఇరాన్‌లో 800 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా, ఐదు రోజుల్లో ఇరాన్‌లోని 1,700 లక్ష్యాలపై దాడులు చేసినట్టు యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) తెలిపింది. వీటిలో నావికాదళ నౌకలు, సబ్‌మెరీన్లు, యాంటీ షిప్ క్షిపణి వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు కూడా ఉన్నాయని వెల్లడించింది. కాగా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీకి ప్రజలు బుధవారం రాత్రి నుంచి మూడు రోజులు నివాళులు అర్పించనున్నాయి. పేటికలో ఉంచిన ఆయన మృతదేహాన్ని టెహ్రాన్‌లోని ప్రార్థనా మందిరంలో ఉంచనున్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా పని చేస్తున్న ఉన్నతాధికారులు: బాల్క సుమన్

**మంచిర్యాల,**

జిల్లా కలెక్టర్, డీసీపీ నుంచి కింది స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా పని చేస్తున్నారంటూ ఉన్నతాధికారులపై బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగుల్లా వ్యవహరిస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా జైలు నుంచి బాల్క సుమన్ విడుదలయ్యారు. అనంతరం ఆయన క్యాతనపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ తర్వాత బాల్క సుమాన్ విలేకర్లతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల వేళ మంత్రి వివేక్, ఎంపీ వంశీ కృష్ణ అరాచకానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆ సమయంలో ఘర్షణకు కాంగ్రెస్ పార్టీ నేతలే కారణమన్నారు. ఆత్మరక్షణ కోసం ప్రయత్నం చేసిన తమపై అక్రమ కేసులు పెట్టించారని విమర్శించారు. సమావేశం లోపల మహిళా కౌన్సిలర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను జైల్లో ఉన్నప్పుడు రామకృష్ణపూర్ పోలీసులు తన ఇంట్లో సోదాలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

# ఎర్రబెల్లి శ్రీలింగమంతుల జాతరకు ముస్తాబైన ఆలయం.....

**-మార్చి 07నుంచి 10వరకు కొనసాగునున్న ఎర్రబెల్లి శ్రీ లింగమంతుల జాతర**

**-ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దురాజ్ పల్లి జాతర తర్వాత యాదవుల రెండోవ పెద్ద జాతర ఎర్రబెల్లి శ్రీలింగమంతుల జాతర**

**-శ్రీ లింగమంతుల జాతరకు వచ్చే భక్తులకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేకబస్ సౌకర్యాలు కల్పన**

**-ఎర్రబెల్లి గుట్ట వద్ద లింగమంతుల స్వామి, అమ్మవార్ల కథ ప్రదర్శన**





**నిడమానూరు ,మార్చి 04(ప్రజాజ్యోతి)**

:ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రసిద్ధి గాంచినఎర్రబెల్లి శ్రీ లింగమంతుల స్వామి జాతర మార్చి 07శనివారం రాత్రి 8గంటలకు ప్రారంభమై 08,09,10తేదీల వరకు శ్రీలింగమంతుల స్వామి జాతర కొనసాగునున్నట్లు ఆలయ చైర్మన్ మన్నెం వెంకన్న పేర్కొన్నారు. అదేవిధంగా యాదవులు నిర్వహించే జాతరలో పెద్దగట్టు (దురాజ్ పల్లి )తర్వాత నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి





శ్రీలింగమంతుల స్వామి జాతర ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. రెండేళ్ళకోసారి జరిగే ఈ జాతరకు యాదవులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ ఎర్రబెల్లి శ్రీ లింగమంతుల జాతరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలతో పాటు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాల నలుమూల నుంచి భక్తులు వచ్చి ఎర్రబెల్లి శ్రీ లింగమంతుల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకుంచారని ఎర్రబెల్లి శ్రీ లింగమంతుల స్వామి ఆలయ చైర్మన్ మన్నెం వెంకన్న యాదవ్, స్థానిక సర్పంచ్ ఐతగోనిమధు లు పేర్కొన్నారు.

**జాతర ఉత్సవాలు వివరాలు.....**

నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ జాతర గతేడాది వచ్చిన రోజుల్లో రావడం గమనార్హం. జాతర తేదీలు వేరైనా శనివారం జాతర మొదలై మంగళవారంతో ముగుస్తుంది. ఈసారి కూడా అదే మాదిరిగా ఎర్రబెల్లి శ్రీలింగమంతుల జాతర జరుగనున్నది. ఎర్రబెల్లి జాతర ఉత్సవాలు శనివారం మార్చి07న రాత్రి 8గంటలకు ఎర్రబెల్లి గ్రామయాదవులు మందగంపలతో జాతర మొదలవుతుంది. అదేవిధంగా ఆదివారం మార్చి 08వతేది రాత్రి 10గంటలకు తల్లి గంప, తెల్లవారుజామున 2గంటలకు శ్రీ లింగమంతులస్వామి మాణిక్యాలదేవి కళ్యాణం, మార్చి09వతేది సోమవారం ఉదయం 8గంటలకు శ్రీ లింగమంతుల స్వామికి (నైవేధ్యం) బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మధ్యాహ్నం
2గంటలకు యలమంతమ్మ బోనాలు, 10వతేది మంగళవారం మూడుగంటలకు మాణిక్యాలదేవి గొర్రెల మంద ప్రవేశంతో జాతర ముగుస్తుందని ఆలయ చైర్మన్ మన్నెం వెంకన్న యాదవ్, స్థానిక సర్పంచ్ ఐతగోనిమధు లుతెలిపారు.

**-ఐదుగురు అమ్మలకు ప్రత్యేకపూజలు...**

ఎర్రబెల్లి శ్రీ లింగమంతుల జాతర సందర్భంగా లింగమంతుడు, మాణిక్యాలదేవిల కళ్యాణం వారికి పూజలతో పాటు ఐదుగురు అమ్మలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. అదేవిధంగా గంగాభవాని, చాముండేశ్వరీ దేవి, ఆగుమంచమ్మ, యలమంచమ్మ, పాపమాక కోమరమ్మలకు ఇక్కడ ప్రత్యేక పూజలు జరుపుతారు.

-లింగమంతుల జాతరకు ప్రత్యేక బస్ సౌకర్యాలు..

నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో శ్రీ లింగమంతుల జాతర సందర్భంగా మార్చి 07నుంచి10వరకు
మిర్యాలగూడ డీఎం ఒక ప్రకటనలో తెలిపారు.

- జాతరకు వచ్చే భక్తులకు ప్రత్యేక వసతులు.. ఎర్రబెల్లి శ్రీ లింగమంతుల స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు గురికాకుండా చూస్తున్నామని ఎర్రబెల్లి శ్రీలింగమంతుల స్వామి ఆలయ చైర్మన్ మన్నెం వెంకన్న పేర్కోన్నారు. ఈసందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ప్రత్యేక వసతులు, త్రాగునీటి వసతుల కోసం ప్రత్యేకంగా మిని బ్యాంక్లు, మరుగుదొడ్లు, షెడ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ మన్నెం వెంకన్న , స్థానిక సర్పంచ్ ఐతగోనిమధు లుతెలిపారు.

